జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 13-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 424 పేజీలు: 4 వెల: రూ.7

## కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో..
# ఉద్దానంలో విధ్వంసం


* ప్రభుత్వ కుట్రలను చేస్తే సహించేది లేదు * ప్రజా ప్రతిఘటన తప్పదు
* జిల్లా మంత్రులపై సీపీఐ జాతీయ నాయకుడు కె.నారాయణ ధ్వజం
* ఎయిర్‌పోర్టు ప్రభావిత ప్రాంతాల్లో భారీ ర్యాలీ



**మందస ఆగస్టు 12(వార్త):** కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో ఉద్దానంలో విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ కుట్రలను చేస్తే సహించబోమని సీపీఐ జాతీయ నాయకుడు కె.నారాయణ అన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ కి వ్యతిరేకంగా, బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ ఎయిర్ పోర్ట్ ప్రభావిత గ్రామాల్లో పర్యటిస్తూ ఎం.గంగువాడ నుంచి రాంపురం వరకు ర్యాలీ జరిగింది. సీపీఐ జాతీయ సహాయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు మద్దిల రామారావు సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రాంపురంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడారు. కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో దోపిడీకి పాల్పడితే సహించేది లేదని, అలా కాదని ముందుకెళ్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో బలవంతంగా భూములు తీసుకోవడం వల్ల ఇక్కడ ప్రజలు నిరాశ్రయులు అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే అతిపెద్ద ఎయిర్ పోర్ట్ ఢిల్లీ కార్గో ఎయిర్పోర్ట్‌కి 150 ఎకరాలు మాత్రమే ఉందని అన్నారు. ఇక్కడ కార్గో ఎయిర్ పోర్ట్‌కి 1400 ఎకరాలు ఎవరు ప్రయోజనాల కోసం కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో ఢిల్లీ, బెంగళూరు, తమిళనాడు, కర్ణాటక, విశాఖపట్నం తదితర రాష్ట్రాల్లో ఎయిర్ పోర్ట్ కి అనుబంధంగానే కార్గో ఎయిర్ పోర్ట్ లున్నాయన్నారు. ఉద్దానంలో మాత్రం ఎందుకు ప్రత్యేకంగా కార్గో ఎయిర్ పోర్ట్ కడుతున్నారని వారు ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతు కార్పొరేట్ కంపెనీల కోసం ప్రజల భూములు లూటీ చేస్తారా అని ప్రశ్నించారు. జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఉద్దానం జీడి పంటని కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో లక్షలాది చెట్లు నరికియడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అదేవిధంగా జీడి ఆధార పరిశ్రమలు దెబ్బతిని వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి జరగాలంటే కార్పొరేట్ కంపెనీకి భూములు ఇవ్వడం ద్వారా కాదని, ఈ జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా చివర భూములకు రెండు పంటలకు నీరు ఇవ్వడం ద్వారా ప్రజల ఆదాయం పెరిగి జిల్లా అభివృద్ధి అవుతుందన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్‌కు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పిఓడబ్ల్యాయు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, ప్రజాకళామండలి సభ్యులు అరుణక్క, కొర్రాయి శ్రీకాంత్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, జోగి శ్రీదేవి, జి.బాలకృష్ణ, జోగి కోదండరావు, పోరాట కమిటీ నాయకులు, రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, ధనంజయరావు, డి.రామారావు, ఎం.తులసిరావు, గుంటు రామస్వామి, లండ రామస్వామి, ఎం.సంతోష్, చిత్త గున్నయ్య, కోనేరు రమేష్, కీలు తెల్లయ్య, మడియా రుషి, గుంటు కపిల్, తదితరులతో పాటు ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### నారాయణ దృష్టికి వంశధార సాగునీరు సమస్య

సీపీఐ జాతీయ కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు కె.నారాయణకు వంశధార సాగు జలాల సమస్యను వంశధార సాగు జలాలు సాధన కమిటీ నాయకులు వివరించి, వినతిపత్రం అందజేశారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతం పర్యటనకు వచ్చిన ఆయనను కలసి సమస్యను తెలిపారు. వంశధార సాగునీటి సాధన కమిటీకి మీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. వంశధార సాధన గళం రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించగలరన్నారు. కార్యక్రమంలో వంశధార సాగునీటి సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు, మార్పు ట్రస్ట్ అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, వంశధార సాగునీటి సాధన కమిటీ ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, కొర్ల హేమారావుచౌదరి, నల్ల హడ్డి, బైరిశెట్టి గున్నయ్య, దుంపల వైకుంఠరావు, ఉగ్రిపిల్లి సోమనాదం, మామిడి కోదండరావు, అన్నెపు సుధాకర్, కొవ్వూరు దాశరథి, వాయలపల్లి రమణ, కొర్నాన గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



### 72 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**కొత్తూరు, ఆగస్టు 12 (వార్త):** కొత్తూరు మండలంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మన్యం జిల్లా సీతంపేట మండలం కేంద్రం నుంచి ఒడిశా రాష్ట్రంలోని హడ్డుబంగి గ్రామం వైపు తరలిస్తుండగా, మాతల సమీపంలో 72 క్వింటాళ్లు 32 కేజీలు (మొత్తం 140 బస్తాలు) పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ కొత్తూరు మండలం కడుము గ్రామానికి చెందిన గోవిందరావు అని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కేసు నమోదు చేసి, సివిల్ సప్లై డీటీ శాంతారావు సమక్షంలో కొత్తూరు తహసిల్దార్ కార్యాలయానికి తరలించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

## అన్నదాతకు అండగా..
# కూటమి ప్రభుత్వం



* సంక్షోభ సమయంలోనూ రైతుల సంక్షేమం, అభ్యున్నతే చంద్రన్న ధ్యేయం
* పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు * 500 ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లతో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ

**పాతపట్నం, ఆగస్టు 12 (వార్త):** అన్నదాతకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సంక్షోభ సమయంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రన్న పాలన కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులను మంజూరు చేయడంతో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో 500 ట్రాక్టర్లు, ఎడ్లబళ్లతో పాతపట్నంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మార్కెట్ యార్డు వరకూ భారీ ఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడతగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. అన్నదాతకు ఇచ్చిన మాట మేరకు సీఎం చంద్రబాబునాయుడు ధాన్యం కొనుగోలు సమయంలో 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని, వరి, అరటి, మామిడి, మొక్కజొన్న సాగు చేసిన రైతులను ఆదుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల పిఎసిఎస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఐదు మండలాల అధ్యక్షులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

### పలాసలో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ

**పలాస, ఆగస్టు 12 (వార్త):** అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మంగళవారం పలాసలో రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ఈ ర్యాలీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు దగాకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తుందని వెల్లడించారు. విత్తనాల పంపిణీ నుంచి ఎరువులు, సాగునీరు తదితర విషయాల్లో రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు వంకల కూర్మారావు, కణితి సురేష్ చౌదరి, పీరుకట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, గురిటీ సూర్యనారాయణ, కొరికాన శంకర్, యవ్వారి మెహనారావు, ఎం నరేంద్ర, భావన దుర్యోధన, కుతుమ్ లక్ష్మణ్, సూరాడ మోహనరావు, సప్ప నవీన్, రవిశంకర్ గుప్తా, డొక్కరి శంకర్, సాసుమాన చంద్రమౌళి, జోగ మల్లీ, తమ్మినేని గంగారాం, సవర సోమేశ్వరరావు, రైతన్నలు, నాయకులు, మహిళలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఓటు చోరీపై ప్రశ్నిస్తే అరెస్టులా?

**నరసన్నపేట/జలుమూరు, ఆగస్టు 12(వార్త):** ఓటు చోరీ విషయంపై ప్రశ్నలు అడిగితే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ పిరికిపంద చర్య అని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మామిడి సత్యనారాయణ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎన్నికలు పారదర్శకంగా జరగని రోజున ప్రజాస్వామ్యం క్షీణిస్తుందని ఆయన హెచ్చరించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**జి.సిగడాం, ఆగస్టు 12 (వార్త):** జి.సిగడాం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి మండల బీజేపీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి జి.సిగడాం బజార్ వరకు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగరవేయడమే హర్ ఘర్ తిరంగా ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇది మన దేశం పట్ల మనకున్న ప్రేమను ఐక్యతను తెలియజేస్తుందన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. అలాగే ఇళ్లు, కార్యాలయాలు, వాహనాలపై త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించాలని, జాతీయ జెండాతో సెల్ఫీ తీసుకుని వారి వాట్సాప్ స్టేటస్ ల్లో పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా కార్యదర్శి వర్జపర్తి రఘురాం, వికసిత్ భారత్ కన్వీనర్ మీసాల



రామకృష్ణ, సి.గోవిందరావు, త్రినాధరావు, అప్పలరాజు, శంకరావు, బాలబొమ్మ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

**పలాస, ఆగస్టు 12 (వార్త):** ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ పలాస నియోజకవర్గ కన్వీనర్ రామానంద స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ మే తిరంగా అభియాన్ భాగంగా పలాస నియోజవర్గం ప్రాంతంలో ప్రతి ఇంటిపై జెండాను ఆవిష్కరించవలసిన అవసరం ఉందని చెప్పారు. 78వ జాతీయ దినోత్సవం సందర్భంగా వారం రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని బిజెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్ తో పాటు జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు కొందరు దిప్తిపాత్రతో పాటు స్థానిక బిజెపి నాయకుడు శ్రీనివాసరావు, పలువురు కార్యకర్తలు, రిక్షా కార్మికులు కార్యకర్తలు పాల్గొన్నారు.






## జాబ్ మేళాను వినియోగించుకోవాలి

**నరసన్నపేట/జలుమూరు, ఆగస్టు 12(వార్త):** నరసన్నపేట పద్మావతి జూనియర్ కళాశాలలో జాబ్ మేళాను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్య సంస్థ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తుందని, విద్యార్థులకు చదువుతోపాటు స్కిల్ ఉండాలని సూచించారు. ప్రభుత్వం యువతలో నైపుణ్యాల పెంపొందించేందుకు జిల్లాల్లో 8 నైపుణ్య అభివృద్ధి కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 11 కంపెనీలు సంబంధించిన వారు 500 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్ , కళాశాల ప్రిన్సిపాల్, కూటమి నాయకులు, కార్యకర్తలు యవతీ, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీనివాసపురంలో అభివృద్ధి పనులు



**మందస, ఆగస్టు 12(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయి. కోట్ల రూపాయలతో మూలిపాడు పంచాయతీని అభివృద్ధి పథంలోకి ఆయన తీసుకుపోతున్నారు. దీనిలో భాగంగా ప్రజల అవసరాల మేరకు పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురంలో శాశ్వతమైన సిమెంట్ డ్రైనేజ్‌ల నిర్మాణం చేయిస్తున్నారు. వర్షాకాలం కావడంతో నీరు వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో శ్రీనివాసపురం గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా వంద మీటర్ల శాశ్వతమైన సిమెంట్ డ్రైనేజ్‌లను నిర్మించారు. నిర్మాణం పనులు పూర్తి కావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.ప్రసన్నకుమార్ పరిశీలించారు. కొలతలు, నిర్మాణంలో నాణ్యత బాగుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ రామచంద్రచౌదరి, మాజీ సర్పంచ్ గౌరహరిమహంతితో పాటు గ్రామస్తులు సర్పంచ్ వెంకటరావుకు అభినందనలు తెలిపారు.

## కౌలు రైతులుగా నమోదు చేసుకోండి

**సరుబుజ్జిలి, ఆగస్టు 12 (వార్త):** కౌలు రైతులు తమ, తమ వివరాలను స్థానిక వీఆర్ఓ వద్ద నమోదు చేసుకోవాలని సరుబుజ్జిలి మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. అప్పుడే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. మండలంలో మొత్తం 12 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ప్రస్తుతం 642 టన్నులు యూరియా దిగుమతి అయిందని ఇందులో 460 టన్నులు ఆర్.బి.కేలకు తెప్పించామన్నారు. నేలకు సరిపడినంత ఎరువులు మాత్రమే వాడాలని రైతులకు సూచించారు.

## దాసుకూర్మాచార్యులకు ఘన స్వాగతం

**మందస, ఆగస్టు 12(వార్త):**వేదపండితులైన శ్రీవాసుదేవ పెరుమాళుని ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, హర్షిణి దంపతులకు ఘన స్వాగతం లభించింది. ఆయన అమెరికాలోని ఆలయాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్లారు. విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి స్వదేశానికి వచ్చిన దాసుకూర్మాచార్యులకు శ్రీవాసుదేవసేవాసమితి ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. వాసుదేవుని చలువతో విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని, మళ్లీ స్వామి సేవలకు పునరంకితులు కానున్నారని కాళీచరణ్, జామి ఈశ్వర వెంకట వర ప్రసాదరావు, మాదిన వెంకటరమణమూర్తి, గొర్లె కుశరాజు, కొండ పల్లి రఘుపతిరావులతో పాటు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. తనపై చూపిన అభిమానానికి ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు కృతజ్ఞతలు తెలిపారు.




## ఘనంగా రంగనాథన్ జయంతి



**నందిగాం, ఆగస్టు 12 (వార్త):** స్థానిక శాఖ గ్రంథాలయంలో ఎస్ఆర్ రంగనాథన్ 132 వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథ పాలకులు సత్తారు ఉదయ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై అవగాహన

**నందిగాం, ఆగస్టు12 (వార్త):** కాపు తెంబూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్ టెక్కలి డివిజన్ ఇన్చార్జ్ గిరిధర్ ఆధ్వర్యంలో శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. కార్య క్రమంలో పోలాకి జానకిరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పులివెందులలో ప్రజాస్వామ్యం హత్య

**జలుమూరు, ఆగస్టు 12 (వార్త):** పులివెందులలో జరుగుతున్న జడ్పిటిసి ఎన్నికల సందర్భంగా జరిగిన దారుణాలు, అక్రమాలపై మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్య చరిత్రలో మంగళవారం ఒక బ్లాక్ డేగా నిలిచిపోతుందన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం పూర్తిగా హరించబడిందని, మా పార్టీ జడ్పిటిసి అభ్యర్థికి కూడా ఓటు వేయించకుండా అడ్డుకోవడం చూస్తుంటే పరిస్థితులు బాగా దిగజారిపోయాయన్నారు. ఇది పాలకుల చేతగానితనానికి, నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్టు పూర్తిగా అక్రమమన్నారు. టీడీపీ ఏజెంట్లు దాడులు చేస్తుంటే వారిపై చర్యలు తీసుకోకుండా, ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం అన్యాయమన్నారు.



## పులివెందులలో జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ రిగ్గింగ్




**కొత్తూరు, ఆగస్టు 12 (వార్త):**పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని టీడీపీ అపహాస్యం చేసిందని వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందన్నారు. టీడీపీ గూండాలు పోలింగ్ కేంద్రాల్లో దౌర్జన్యానికి పాల్పడి, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపించేశారన్నారు. చంద్రబాబు నాయుడు ఇలాంటి నీచ రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ధ్వజమెత్తారు. ఈ ఎన్నిక ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. . జెడ్పీటీసీ అభ్యర్థిని కూడా ఓటు వేయకుండా అడ్డుకోవడం టీడీపీకే చెల్లిందన్నారు. టీడీపీ, పోలీసులు కలిసి కుట్ర పన్ని, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. టీడీపీ ఓటర్లు మాత్రమే ఓటు వేసేలా ప్లాన్ చేసుకుని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని రెడ్డి శాంతి అన్నారు.

# ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరు సాగించాలి

- **ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి**
- **ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం**

**పలాస, ఆగస్టు 12, (వార్త):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని పలాస పట్టణంలో జూనియర్ కాలేజీలో ఏఐఎస్ఎఫ్ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం మా జన్మ హక్కు అని ఈ దేశాన్ని పాలిస్తున్నటువంటి బ్రిటిష్ తెల్ల దొరల తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యను కాషాయకరణ చేయడానికి ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని, ఆ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకంలో చాలా



షరతులు పెట్టడం వల్ల చాలామంది విద్యార్థులకు అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కే సాయి, రాహుల్, నాయుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నియోజకవర్గ స్థాయి వజ్రోత్సవ పోటీలు

**పలాస, ఆగస్టు 12 (వార్త):** బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు విద్యార్థులకు పలు పోటీల నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వజ్రోత్సవాలను పురస్కరించుకుని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గ స్థాయిలో పోటీలు మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలు ఈనెల 14న శ్రీకాకుళంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



# నులి పురుగుల నివారణకే డీవార్మింగ్ డే

**పలాస, ఆగస్టు12 (వార్త):** మండలంలోని నగరంపల్లి హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మాత్రలు పంపిణీ చేశామన్నారు. సీహెచ్‌వో ఎస్.ఈశ్వరమ్మ, ఏఎన్ఎం ఎస్. కృష్ణవేణి, ఆశ కార్యకర్త బి.లక్ష్మి, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు అవగాహన కల్పిస్తూ నులిపురుగులు నుండి రక్షణ కోసం గోళ్లు చిన్నవిగా కత్తిరించుకోవాలని, చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయ సిబ్బంది కె. రమణ, టి.యర్రన్న, పి. సోమేశ్వరరావు, ఎల్.శ్రీదేవి, జి. నిర్మల, సీ.హెచ్. ఉమారావు, వై. కాళిదాసు, జి. గజేంద్ర రావు, టి. కమలకుమారి, ఆర్. ఇంద్రసేనరావు, ఎన్. గౌరీనాయుడు, బి. చంద్రశేఖర్, బి. ఉత్తర కుమారి, జె. నారాయణ, జి. విశ్వనాధరావు,డివిఆర్ సుజాత, పి. చిన్నారావు, బి. సంజీవరాణి తదితరులు పాల్గొన్నారు.



## జలుమూరులో డీ వార్మింగ్

**జలుమూరు, ఆగస్టు 12 (వార్త):** జలుమూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలురు పాఠశాలలో మంగళవారం నేషనల్ డీ వార్మింగ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 5756 మంది పిల్లలకు నులిపురుగులు నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుజాత, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, మాధవ రావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ



**వజ్రపుకొత్తూరు, ఆగస్టు 12 (వార్త):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పలు పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నులిపురుగులు నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలో 19 సంవత్సరాల లోపు 4805 మంది విద్యార్థులకు అల్బెంజోల్ మాత్రలు వైద్య సిబ్బంది మింగించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నులి పురుగులు ఎలా ఏర్పడతాయి, వాటితో జరిగే అనర్థాలు అనారోగ్య సమస్యలు వివరించారు. ముఖ్యంగా మలవిసర్జన ఆరుబయట ఎవరు వెళ్లకూడదని, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అల్బెంజోల్ మాత్రలు తీసుకోవడం వలన పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వాలు జాతీయ నులి పురుగులు నిర్మూలన దినోత్సవం అనే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వాహిని ప్రియాంక, డాక్టర్ వినయ్ కుమార్, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కేంద్రాల్లో..

**మందస, ఆగస్టు 12(వార్త):** మందస మండలంలోని పలు అంగన్ వాడీ కేంద్రాలలో డీ వార్మింగ్ డే(జాతీయ నులిపురుగుల దినోత్సవం) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రీస్కూల్ పిల్లలకు మధ్యాహ్నం భోజనం అనంతరం అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు నులి పురుగుల నివారణ మాత్రలు అందించారు. కార్యక్రమంలో సీడీపీఓ పెద్దింటి అరుణ, సూపర్ వైజర్ సీహెచ్ వీ రామలక్ష్మి, పీహెచ్ఎం పెంటమ్మ, హెచ్ వీ భారతి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు అందించామని సూపర్ వైజర్ సీహెచ్ వీ రామలక్ష్మి తెలిపారు.



## నులిపురుగుల మాత్రల పంపిణీ

**సరుబుజ్జిలి, ఆగస్టు 12 (వార్త):** మండలంలో పలు ప్రభుత్వ విద్యాలయాలలో జాతీయ నులిపురుగుల నివారణ మాత్రలను నందికొండ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కార్యాలయాలలో పంపిణీ చేశారు. డీఐవో డాక్టర్ రామదాసు ఆధ్వర్యంలో ఆల్బండజోల్ మాత్రలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాహితి ప్రియదర్శిని, డీఎంవో ముఖలింగం, సీహెచ్‌వో డి.మోహన రావు, ఎస్.జి. టి. వివేకా సుధా, మోహిని, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.



## పాఠశాలల్లో డీ వార్మింగ్ డే

**ఇచ్ఛాపురం, ఆగస్టు 12, (వార్త):** స్థానిక జ్ఞాన భారతి పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులకు డి వార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యదర్శి జోహార్ ఖాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.బి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యిదాసుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, ఏఎన్ఎంలు టి ఇందిర, సంతోష్ బెహరా, కె శాంతి కుమారి పాల్గొన్నారు. శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జాతీయ నులిపురుగులు నిర్ములన కార్యక్రమం నిర్వహించారు. ఆల్బెండజోల్ (నులి పురుగుల నివారణ మాత్రలు) స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి విద్యార్థులకు వేయించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కె.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, జయలక్ష్మి, యశోద, రవి, ఆశ వర్కర్లు బి. యర్రమ్మ, కె. రామలక్ష్మి, ఎస్. సరోజ పాల్గొన్నారు.పంజా స్ట్రీట్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. భాస్కరరావు పాల్గొన్నారు. హరిపురం అంగన్ వాడీ కేంద్రం లో సూపర్ వైజర్ సుజాత డి వార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు.




## 7,146 మందికి మాత్రలు పంపిణీ

**కొత్తూరు, ఆగస్టు 12 (వార్త):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కురిగాం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ప్రసన్నకుమార్, కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాకేష్ చంద్రన్ ఆధ్వర్యంలో కొత్తూరు మండలంలోని నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. 43 అంగన్వాడీ కేంద్రాలు, 45 పాఠశాలలు, 2 కళాశాలల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 7,146 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గోవిందరావు, శ్రీనివాసరావు, బుచ్చిబాబు, మండలంలోని ఆశ వార్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# నులిపురుగులను నులిమేద్దాం

**✻ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, ఆగస్టు 12 (వార్త):** ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎన్‌టిఆర్ మునిసిపల్ హై స్కూల్ లో జరిగిన మాత్రలు పంపిణీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, కిశోర బాలల కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనతతో నీరస పడతారని, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలకు గురవుతారని తెలిపారు. గత రెండు వారల నుంచి విద్యార్థులకు, పిల్లల తల్లిదండ్రులకు, సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా ఇవ్వబడే అల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చునని అన్నారు. జిల్లాకు ఆల్బెండజోల్ 400మి.గ్రా టాబ్లెట్స్ 5,03,800 వచ్చాయన్నారు. ఈ టాబ్లెట్స్ జిల్లాలో మండల పరిధిలో పి.హెచ్.సి. వైద్యాధికారి, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో, సీఆర్పీల పర్యవేక్షణలో అన్ని పాఠశాలలకు, అంగ న్వాడి కేంద్రాలకు 8వ తేది నాటికి ఈ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలకు ఒక ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షకుడుగా నియమించడం జరిగిందన్నారు. ఈ మాత్రలు వేసుకొనడం వలన ఏవిధమైన ఔషద దుష్పరిణామాలు ఉండవని, ఒకవేళ ఔషధ దుష్పరిణామాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పి. హెచ్.సి వైద్యాధికారిని సంప్రదించవలెనన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొంత మంది పిల్లలు కొన్ని కారణాలు వలన ఆల్బెండజోల్ 400మి.గ్రా టాబ్లెట్ తీసుకోక పోయినట్లయితే మళ్ళీ వారం ఈ కార్యక్రమం నిర్వ హించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా ఆఫీసర్ డా బి. మీనాక్షి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. కె. అనిత, డిపిఓ ఇ. వెంకటరావు, మలేరియా మేనేజర్ అప్పలనాయుడు, మెడికల్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సీతారామాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 12 (వార్త):** టి.బరంపురంలో వెలసిన సీతారామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా టీటీడీ ఏర్పాటు చేసిన పండితులు కెదాలినాయుడు రామాయణం ప్రవచనాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం సీతారామ భజన బృందం భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పన తమ్మయ్య రెడ్డి, ఆర్థికట్ల బాలకృష్ణ, గణేష్, కేదారి, లింగయ్య, ఉమాపతి, వాసు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# పట్టులోగాం ఆశ్రమ సమస్యను పరిష్కారిస్తాం

* నాణ్యమైన విద్య అందిస్తాం
* పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**మందస, ఆగస్టు 12(వార్త):** గిరిజన బాలికోన్నత ఆశ్రమంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పలాస నియోజకవర్గం శాసన సభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన కొండలోగాం పంచాయతీ, పట్టులోగాంలో గల గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి, ఆశ్రమంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల మధ్య ఆధిపత్య పోరు ఉందని స్థానికులు ఆమెకు చెప్పారు. విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల సమస్య పరిష్కరిస్తామన్నారు. ఉపాధ్యాయులు వేరే చోటుకు బదిలీ అయినట్టు తెలుస్తోందన్నారు. నాణ్యమైన విద్య అందిస్తామన్నారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు, గిరిజన నాయకులు ఉన్నారు.

# పట్టులోగాం ఆశ్రమ సమస్యకు అధికారులే కారణం

* ఆదివాసీ గిరిజన సంఘం ఆరోపణ

**మందస, ఆగస్టు 12(వార్త):** మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ పట్టులోగాం గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమంలో జరిగిన పరిణామాలు పూర్తిగా జిల్లా అధికారుల వైఫల్యమేనని గిరిజన సంఘం జిల్లా నాయకులు సవర పాల్గుణ, సవర ధర్మారావులు ఆరోపించారు. పట్టులోగాం గిరిజన సంక్షేమ హాస్టల్ ను మంగళవారం గిరిజన సంఘం సభ్యులతో కలిసి సందర్శించారు. హాస్టల్‌ను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు పట్ల అనుచితంగా ప్రవర్తించిన ముగ్గురు టీచర్లను హాస్టల్ నుండి బదిలీ చేయాలని కోరితే వారిని కాకుండా వేరే వారిని ఒకరిని బదిలీ చేయడం వల్ల, సమస్య పరిష్కారం కాదని భావించిన విద్యార్థులు హాస్టల్ నుండి ఖాళీ చేసి వెళ్ళిపోయారన్నారు. దీనికి పూర్తి భాద్యత జిల్లా అధికారులే వహించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ సమస్యలు పట్ల పరిశీలనకు వచ్చిన డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూఓ



మల్లికార్జునరావులు విద్యార్థుల భవిష్యత్ తో ఆటలాడుకోవడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు సరైన చర్యలు చేపట్టకపోతే అన్ని ప్రజా సంఘాలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సవర లక్ష్మీనారాయణ, గిరిజన సంఘం నాయకులు సవర నాగేశ్వరరావు, నర్సింగులు, ఎస్.బలరాం, ఎస్.జగన్, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం



**మందస, ఆగస్టు 12(వార్త):** గిరిపుత్రుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలం గిరిజన ప్రాంతమైన కొండలోగాం, పట్టులోగాం గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రణాళిక బద్ధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ప్రజల పక్షానే ఉంటుందన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గడచిన సంవత్సరం కాలంలో ప్రజలకు అందించిన, రానున్న కాలంలో అందించనున్న సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేరుస్తున్నారన్నారు. దశలవారీగా రాష్ట్రంలో భారీగా ఉద్యోగాల కల్పనకు సీఎం శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, టీడీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆల్బెండ్రజోల్ మాత్రల పంపిణీ



**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 12 (వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు లక్ష్మీనర్సు పేట ప్రభుత్వ వైద్యాధికారి డా.సునీత అల్బెంద్రజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా డా.సునీత మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ఈ మాత్రలు వేసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.డా.ఎం.కె.మిశ్రో, ఉపాధ్యాయులు ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర, వైద్య సిబ్బంది ఉమా, రాజేశ్వరి, ఆశా కార్యకర్త లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఎన్‌పేట మండలాన్ని శ్రీకాకుళం డివిజన్లో కలపండి



**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 12 (వార్త):** ఎల్ఎన్‌పేట మండలాన్ని టెక్కలి డివిజన్ నుంచి తప్పించి శ్రీకాకుళం డివిజన్‌లో కలపాలని ఎల్ఎన్‌పేట మండల ప్రజలు కోరుతున్నారు. పలువురు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఎల్ ఎన్ పేట మండల తహసిల్దార్ జె ఈశ్వరమ్మకు పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకునేందుకు టెక్కలి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన శ్రీకాకుళంతో పోలిస్తే టెక్కలికి ఎల్ఎన్ పేట మండలం చాలా దూరంలో ఉందని. గత ప్రభుత్వం హయాం ముందు శ్రీకాకుళం డివిజన్‌గా కొనసాగేదని అప్పటి వైకాపా ప్రభుత్వం టెక్కలి డివిజన్ కేంద్రంగా మార్చిందన్నారు. తమ మండలాన్ని తిరిగి శ్రీకాకుళం డివిజన్లో చేర్చాలన్నారు.

## పీఏసీఎస్ అధ్యక్షునికి సన్మానం

**జి.సిగడాం, ఆగస్టు 12 (వార్త):** మెట్టవలస గ్రామ ఎంపీటీసీ ప్రతినిధి టీడీపీ సీనియర్ నాయకులు బెవర జగన్నాథరావుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చొరవతో జి.సిగాడం పీఏసీఎస్ అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జగన్నాథరావుకు పార్టీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేసి సన్మానించారు. అలాగే గ్రామ సర్పంచ్ కామోజుల సీతారాం, పెద్దలు, యువత సైతం జగన్నాథ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.





## శ్రీరామచంద్రమూర్తికి మాతృవియోగం



**జలుమూరు, ఆగస్టు 12 (వార్త):** ఇటు ఆంధ్రా అటు తెలంగాణాలో కళింగ జాతి కోసం, 26 బిసి కులాల ఔన్నత్యం కోసం కృషి చేస్తూ, గత సంవత్సరం శ్రీముఖలింగంలో పురాతనంగా మరుగున పడ్డ బాలి యాత్ర పునః ప్రారంభ కార్యక్రమానికి అన్ని రకాల చేయూతనందించి విజయవంతం చేసిన కళింగ ముద్దు బిడ్డ, తెలంగాణ 26 బిసి కులాల జేఏసీ ప్రధాన కార్యదర్శి శ్రీరామ రక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొడ్డేపల్లి శ్రీరామ చంద్రమూర్తికి మాతృవియోగం కలిగింది. సుమారు 85 ఏళ్ల వయసు గల తన తల్లి బొడ్డేపల్లి అమ్మాయమ్మ గత సోమవారం బూర్జ మండలం గుత్తావల్లిలోని వారి స్వగ్రామంలో తుదిశ్వాస విడిచారు. వచ్చే శనివారం అనగా 16న వారి స్వగ్రామంలో పెద్ద కర్మ కార్యక్రమం జరుగుతుందని కుటుంబీకులు తెలిపారు.

## 20 మద్యం సీసాల పట్టివేత

**కొత్తూరు, ఆగస్టు 12 (వార్త):** పారాపురం గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలు జరుపుతున్న మునుకోటి శేఖర్ అనే వ్యక్తిని కొత్తూరు ఎస్ఐ అమీర్ ఆలీ మంగళవారం పట్టుకున్నారు. అతని నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.2,600గా అంచనా వేశారు శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు.

## గంజాయి రవాణాదారు అరెస్ట్



**కొత్తూరు, ఆగస్టు 12 (వార్త):** కొత్తూరు మండలంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు మాతల గ్రామంలో 7 కిలోల గంజాయిని అక్రమంగా ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్ నుండి చెన్నైకి తరలిస్తుండగా కొత్తూరు పోలీసు సిబ్బంది తమిళనాడుకు చెందిన మహాలింగం సూర్యంను పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా టెక్కలి డీఎస్పీ దాసరి లక్ష్మణరావు మంగళవారం కొత్తూరు పోలీసుస్టేషన్‌లో పత్రికా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్యంను అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేకపోతే పలు అనర్థాలు కలుగుతాయని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా గంజాయి, మాదకద్రవ్యాలు తరలిస్తున్నారని అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి తరలిస్తున్న సూర్యంను పట్టుకున్న కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ అమీర్ అలీ, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## జిల్లా చరిత్రపై విద్యార్థులకు పోటీలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 12 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఆవిర్భావం జరిగి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా జూనియర్ కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శరత్ బాబు, శంకర్ రావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. కస్తూరి భా, మోడల్ స్కూల్, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లా విశిష్టతపై పలు పోటీలు

**నరసన్నపేట, ఆగస్టు 12 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల పర్యవేక్షించారు. నరసన్నపేట నియోజకవర్గంలోని సారవకోట, పోలాకి, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలు జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు. న్యాయనిర్ణేతలుగా అధ్యాపకులు శివరాంప్రసాద్, సత్యనారాయణ, వేణుగోపాలరావు, నాగకుమారి, విశ్వప్రసాద్, ఆనందరావు, రాంప్రసాద్ వ్యవహరించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546